


# నా....కోసం!

లక్ష్మీ భారతి రెడ్డి

ఆ రోజు విజయదశమి!

ప్రొద్దున్నుండీ తను నన్నేమీ కదిలించలేదు. మాట్లాడాలని ప్రయత్నించలేదు. భోజనానికీ పిలవలేదు. నా వైపు కూడా రాలేదు. వచ్చి ఏ విధమైన ప్రయత్నం చేసినా ఫలితం ఉండదని తనకు బాగా తెలుసు. సంవత్సరానికి ఒక్క రోజు, ప్రత్యేకించి విజయదశమి రోజు నేనేమీ తినను. ఎవరితోను మాట్లాడను. ఇంటికి ఎవరు వస్తున్నారో, వెళ్తున్నారో అసలే పట్టించుకోను. ఎందుకంటే ఏ రోజు ఎవరిదైనా, ఈ ఒక్క రోజు నాది, నా సొంతం, నా సర్వస్వం గనుక. నా గుండెకు తగిలిన గాయం ఇంకా.... ఇన్నేళ్ళయినా పచ్చిగానే ఉంది. ఇంకా వెచ్చగా రక్తం కారుతూనే ఉంది.

నేనెప్పటికీ పొందలేని అపురూపాన్ని పోగొట్టుకున్నాను. అలాగని నా భార్య మౌనిక అంటే నా కిష్టం లేక గాదు. ఆ ఇష్టమే లేకపోతే ఇన్నేళ్ళ మా కాపురానికి గోపురంగా ఇద్దరు పిల్లలు ఎలా పుట్టుంటారని?

మౌనిక మంచిదే. ఓర్పుగలదే. కానీ తొందర పాటు పాలు ఎక్కువ.

"నీది తొందరపాటు" అనంటాను నేను.

"కాదు ముందు జాగ్రత్త" అంటుంది తను.

ఆమె ఒప్పో, నేను తప్పో... లేక నేను ఒప్పో, ఆమె తప్పో, కాలం తేల్చి చెప్పలేకపోయింది.

"పరాయి దేశం వెళ్ళి ఒక్క రోజు పస్తుండవే, ఆకలి విలువేంటో తెలుస్తుంది. ఓదార్చే వారెవరూ లేనపుడు, ఒంటరిగా కూర్చొని ఏడవవే ఓదార్పు విలువేంటో తెలుస్తుంది" అని గద్దిస్తాను నేను.

"ఆ....ఆ! మీరూ ఒక్కసారి ఆడదానిగా పుట్టి ఖాళీ బిందె నట్టుకుని వీధి కుళాయి దగ్గర

[illegible] అమ్మ లక్కల సూటి పోటి మాటలు [illegible] పదును ఎంత ఎక్కువో అర్థం అవుతుంది. ఆడ పుట్టుక పుడితేగాని, తన మొగుణ్ణి పరాయివారెవరో ఎగరేసుకుపోతుంటే ఆ ఆడమనసు పడే ఆవేదన ఏంటో తెలీదు" అంటుంది మౌనిక.

నా మాటల్లో నిజం ఉందని నాకు తెలుసు. ఆమె మాటల్లో నిజం ఉందా?

రాత్రయ్యింది! ఆకాశాన్నేలడానికి చంద్రుడు చుక్కల సైన్యంతో తరలి వచ్చాడు. అలవాటు ప్రకారం మల్లె పందిరి కింద నా మంచం, దోమ తెర వేసి, నీళ్ళ చెంబుపై మూత, దానిపై గ్లాసు ఉంచి పోడి దగ్గు దగ్గుతూ లోనికెళ్ళిపోయింది మౌనిక. ఆ ఏర్పాట్లన్నీ ఓ కంట గమనిస్తూనే, గమనించనట్టే నటించసాగాను. మనిషి తన జీవిత కాలంలో ఎంతో నటించాలి. ప్రత్యక్షంగా ఒకసారి. పరోక్షంగా చాలా సార్లూను. మాది మాత్రం ప్రత్యక్ష పరోక్ష నటన.

"పిల్లలకు పెళ్ళిళ్లయ్యాయి. వారి బతుకేదో వారు బతుకుతున్నారు. రేపా మాపో అన్నట్టు మీ జీవితాల్లో ఇంకా ఆ పాత తెరలెందుకురా?" మిత్రుడు భాస్కరం అనే మాటలు గుర్తొచ్చాయి.

"మనిషి కొన్ని మరువగలడు. కొన్ని మరణం వరకు మరువ లేడు. అమ్మని మనం ఎలా మరువలేమో... ఆకలినీ అంత సులభంగా మరువలేం. అలాంటిది భావనని ఎలా మరచిపోమంటావురా?" నేను వాడికి ఎప్పుడూ చెప్పే సమాధానం ఇదే.

"ఏదో స్నేహ ధర్మం కొద్దీ చెప్పానంతే ఆ తర్వాత నీ యిష్టం" అని తేల్చే వాడు నన్నొప్పించడం వాడివల్ల కాక.

మా ఊరికి మూడు కిలో మీటర్ల దూరంలో చెరువు కట్టపై ఉన్న రైలు మార్గంపై ఏదో రైలు కూతేసుకుంటూ వెళ్తున్నట్లుంది, రాత్రి పూట కావడం వల్ల ఆ శబ్దం లీలగా నా చెవులకు సోకుతోంది.

ఆ రైలు ఎటు పరుగెడుతోందో తెలీదు. కానీ నా మనసు మాత్రం గతం వైపు పరుగులు తీసింది. తీపి జ్ఞాపకాలు గది ముందు నిలబడి అనుభవాల సవ్వడి చేశాను.

* * *

"ఏమిటి భావని? నాకు పెళ్ళయ్యింది, నీకు తెలుసుగా! ఒక బాబు కూడా" ఆమె కోరికకు అదిరిపడి అన్నాను.

"తెలుసు" కూల్‌గా జవాబిచ్చింది భావని.

"కాస్త ఆలోచించు. జీవితంలో సగం ప్రయాణం ముగించేశాను నేను. అసలు ప్రయాణమే ప్రారంభించని దానివి నువ్వు.

## సవాల్

మిస్ ఇండియా నేహా ధూపియా 'కయామత్' అనే చిత్రంతో బాలీవుడ్ ఇండస్ట్రీలో అడుగుపెడుతోంది. 'ఇంతమంది బ్యూటీ క్వీన్స్ ఇండస్ట్రీలో ఉన్నారు కదా? వారు మీకు పోటీ కదా' అంటే అలాంటిదేమీ లేదు. అందరు హీరోయిన్లు చెప్పినట్లే నేహా ధూపియా కూడా ఇక్కడ ఎవరికి ఎవరూ పోటీ కాదు అంటోంది. నేహా ఇండస్ట్రీలో కొన్నేళ్ళపాటు నిలబడాలని అనుకుంటోందిట. కాబట్టే ఎక్స్‌పోజింగ్ అవి భారీగా చేసైనా సరే, స్థానాన్ని పదిలంగా కాపాడుకుంటాను అని చెబుతోంది. పనిలో పని నటనలో కూడా ట్రైనింగ్ తీసుకుంటోందిట.



మనిద్దరి మధ్యా వ్యత్యాసం ఎంతో ఉంది."

"చూడు సంజీవి! నా ప్రయాణం నాకు తెలీకుండానే మీతో ప్రారంభమైంది. నా ఆశల పునాది మేడగా రూపు దిద్దుకోగలదనే ఆశతోనే అడుగుతున్నాను. మీ గురించీ, మీ గతం గురించీ అంతా తెలుసు..... నా వర్తమానాన్ని నిర్ణయించాల్సింది మాత్రం మీరే" అంటూ తలొంచుకునే ఓ ఉత్తరం నా కందించింది. ఆ ఉత్తరం ఎవరిదో, ఏమిటో అర్థం కాక ఆత్రంగా తెరచి చదవ సాగాను.

"భావనికి, చావురాక చావలేక బ్రతికున్న నీ తల్లిదండ్రులు వ్రాయుట. ఉభయ కుశలోపరి అనేంత పెద్ద వాక్యం వ్రాయలేము. చాలమ్మా..... చాలు. మాకు నువ్వు తెచ్చి పెట్టిన గౌరవ కిరీటం చాలు. కొడుకులు లేని మాకు కూతురివైనా, కొడుకువైనా నువ్వేననుకున్నాం. అది మా పొరపాటు. అక్కడ నువ్వు..... ఛీ.... ఛీ... ఎలా వ్రాయం ఆపదం? తెలిశాక మా పరువు గోదాట్లో నిమజ్జనం అయిపోయింది. నువ్వు చచ్చావని సరి పెట్టుకుంటున్నాం. చచ్చున్నా బాగుండేది ఓ ఏడుపు ఏడ్చి కాల్చి పారేసే వాళ్ళం. ఇక నీకు మాకు ఎలాంటి సంబంధం లేదు! ఎవరితో ఊరేగుతావో ఊరేగు.

నీకు జన్మనిచ్చిన పాపులు
నీ తల్లిదండ్రులు".

ఆ ఉత్తరం చదివి బిత్తరపోయి "ఏమిటి ఈ ఉత్తరం?" ఏదో ఒకటి అడగాలి కాబట్టి అడిగాను.

"నిజం!" సింపుల్‌గా ఆమె సమాధానం.

"ఏ నిజం?"

"మీకూ నాకూ మధ్య ఉన్న సంబంధం"

"అది ఆకలి సంబంధమే"

నాకు పిచ్చెక్కినట్లుంది.

"ఇంతకన్నా నాకు వేరే దారేదీ కన్పించడం లేదు. స్వీకరిస్తారో, నిరాకరిస్తారో అది మీ ఇష్టం" నిర్ణయం నా మీదికే వదిలేసింది భావని.

"నన్నేం చేయమంటావో చెప్పు?" ఏ నిర్ణయమూ తీసుకోక అడిగాను ఆమెనే.

"చెప్పాగా మీ ఇష్టమని" మళ్ళీ అదే సమాధానం ఆమె నుంచి.

పొట్ట చేత బట్టుకుని బ్రతుకు తెరువు కోసం నేను కువైట్ రావాల్సొచ్చింది. పని చూపిస్తామని పిలిపించి ఆ తర్వాత చేతులెత్తేశారు నాకు వీసా తీసిన వారు. నేను బ్రతికేదెలాగో తెలీని పరిస్థితి. నన్ను నమ్ముకున్న నా భార్యా, బిడ్డను ఎలా బ్రతికించుకోవాలో అర్థం కాని దుస్థితి.

ఆకలి "బ్రతకరా బడుద్దాయి. ఎలా బ్రతుకుతావో నేనూ చూస్తాను" అని సవాల్ చేస్తున్న నేపథ్యంలో.....

భగవంతుడు చూపించిన దారిలా, అవసరానికి కనిపించిన త్రోవలా, ఆగిపోనున్న ఊపిరికి అకస్మాత్తుగా లభించిన ఆక్సిజన్‌లా భావని పరిచయం అయింది.

దిగాలుగా కూర్చొని ఉన్న నన్ను ముక్కు మొహం ఎరుగని ఆమె తనకు తానుగా వచ్చి "మీరెందుకు అలా దిగాలుగా ఉన్నారు?" అని ప్రశ్నించింది.

చెపుదామంటే ఆత్మాభిమానం అడ్డొచ్చింది. ఊరుకుందామంటే కడుపులో ఆకలి పిండి మర ఆడించేస్తోంది.

చెప్పేశాను జరిగిందంతా

జవాబుగా తనో నిట్టూర్పు విడిచింది. "భయపడకండి, బాధపడకండి. మీకు అండగా నేనుంటాను. మీకు నేను ఏమీ కాకపోవచ్చు. కానీ మనం మనుషులం" అంది.

ఆ మాటలు నాలోని నీరసాన్ని పారదోలేసాయి గొంతెండి పోతున్న వాడికి మంచి నీళ్ళు దొరికినంత మహా సంబరాన్ని నింపాయి. అలా మొదలైన మా పరిచయాన్ని 'ఆకలి' గట్టిగా ముడేసేసింది. నా మంచి చెడ్డలు, ఆకలిదప్పులు, అవసరాలు అన్నింటిని తన భాధ్యతగా తీసుకోసాగిందామె.

ఆమె మానవత్వానికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలను. మన చుట్టూ ఉన్నవాళ్లంతా మనుషులే. కానీ మనసుండే వారు ఎందరు? అలా సంవత్సర కాలం గడిచింది.

భావని పుణ్యమాని దుక్కలా బలిసాను. నా భార్యా బిడ్డకు పంపుకోమంటూ అప్పుడప్పుడు ఆర్థిక సహాయమూ చేస్తొంది. దాంతో వారి గురించి దిగులు లేదు. మేం చెట్టా పట్టాలేసుకుని తిరగలేదు. నలుగురి దృష్టిలో పడాలని అంతకన్నా ప్రయత్నించలేదు.

నాది అవసరం, ఆమెది మానవత. ఇదే మా మాధ్య పెరుగుతున్న సంబంధం. ఊరికే ఉంటే అది లోకం ఎందుకవుతుంది మిత్రమా!

అది కూయాలి. కూయక తప్పదు. కాకుల గొంతును సైతం జయించే శక్తి దాని కొక్కటికే ఉంది. లోకం కూసింది గోల గోల చేసింది. 'అతను... ఆ అమ్మాయి' అంటూ లేనిపోని ముడులేవో వేసేసింది. ఫలితం!

ఎవరో పుణ్యాత్ములు పనిగట్టుకుని పోస్టేజీని భరించి భావని అమ్మా నాన్నలకు ఉత్తరం రాసేశారు. దానికి తగ్గ పట్టాభిషేకమే ఆమెకా ఉత్తరం మృష్టాన్న భోజ్యానికేం తెలుసు ప్రేవుల గొడవ. కడుపు నిండిన వాడికేం తెలుసు 'బ్రేవ్' మని త్రేన్చడం తప్ప.

* * *

నాకు ఉద్యోగం దొరికింది. అంత మాత్రాన ఇంత కాలం అమ్మలా ఆదరించిన ఆమెనెలా మరువను?

"నీ రుణం తీర్చుకోలేను భావని?"

ఆమె మాట్లాడలేదు. ఆమెకు ఇద్దామని తెచ్చిన ఫ్లవర్ బొకే 'చెప్ప దలుచుకున్నది చెప్పవేం?" అని నన్నే ప్రశ్నిస్తున్నట్లుంది.

'నా అవసరం మిమ్మల్ని కలిపింది. నా ఆకలి మనల్ని జత చేసింది.' అని ఆగాను.

'ఇంకాస్త ముందుకెళ్ళండి' అని ఆమె కూడా ఆగింది.

ఇప్పుడు మాటలు వెతుక్కోవడం కోసం తాత్కాలికంగా మూగ బోవడం నావంతైంది.

"మిమ్మల్ని......" అని ఆగాను ఆపై ఎలా చెప్పాలో తెలీక.

"ఆ... నన్ను వదిలించుకుంటున్నారా?"

'ఛా.... ఛా... అవేం మాటలు?'

'ఏమో? ఇప్పుడు ఉద్యోగస్తులు అయ్యారు కదా, ఇక నాతో ఏం పని?'

"గతాన్ని గుర్తుంచుకుంటేనే మనిషి. ఎవరేమనుకున్నా సరే నా కోసం నువ్వందరికీ దూరం అయ్యావు కాబట్టి నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను" తడుముకుంటూనా చెప్పేశాను.

ఆ క్షణం ఆమె ముఖంలో కన్పించిన కాంతిని వర్ణించాలంటే అదెవరి వల్లా కాదు.

నాలుగ్గోడల మధ్యా ఆ గది గోడల మీది పటాల సాక్షిగా, 'మాంగల్యం తంతు నానేన' అన్న వేద మంత్రాల అవసరం లేకుండానే, మనసుల సాక్షిగా, అంతరాత్మలు అక్షింతలు వేయగా మా పెళ్లి... నా రెండో పెళ్ళి జరిగిపోయింది.

తాళి కట్టిం తర్వాత గంట వ్యవధిలోనే నేను కట్టిన ఆ తాళిని తీసేయమన్నాను.

"తాళి తీసేయాలా? గంట క్రితమేగా కట్టారు? ఆడదాని మెడలో పడేది, తిరిగి తీసేసేది ఒక్కసారే. మీరేం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు" విస్మయంగా అంది భావని.

"సారీ! తీసేయక తప్పదు."

"అదే ఎందుకూ అని?"

"చూడు! నాకు ఇది వరలోనే పెళ్ళయ్యిందని నీకు తెలుసు. జరిగిన పరిస్థితుల దృష్ట్యా నిన్ను పెళ్ళి చేసుకోక తప్పింది కాదని నాకూ తెలుసు. ఇది మనిద్దరి మధ్యే ఉండాలి. ఇప్పుడు నువ్వా తాళితో పది మంది ముందూ తిరిగితే, ఎవరో ఒకరు నా పెళ్ళాంకు జాబు రాయక పోరు."

"ఆమే మీ భార్య! నేను కాదు! నా కంటి తుడుపు చర్యగా ఈ తాళి కట్టారు అంతేనా? అంతలా భయపడేవారు నన్నెందుకు చేసుకున్నారు? చేసుకోమని మీ పీకల మీదగాని కూర్చున్నానా? లేక చేసుకోక పోతే చస్తానని బ్లాక్‌మెయిల్ చేసానా?" ఉక్రోషంగానే ప్రశ్నించింది భావని.

ఆమె ప్రశ్నకు నా వద్ద సమాధానం లేదు. ఏం చెప్తే సరిపోతుందో అంతకన్నా తెలీదు. కొన్ని ప్రశ్నలకు జవాబు కష్టం. మరికొన్ని ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోతాయి.

"కొంత కాలం ఇలాగే....." ఆమెను సూటిగా చూడలేక ఎటో చూస్తూ అన్నాను.

"ఎంతకాలం?"

"ప్లీజ్ భావని! నన్నర్థం చేసుకుని నాకు కొంత టైం ఇవ్వు. నా భార్య మౌనిక చాలా మంచిది. సమయం, సందర్భం చూసి మన 'కథ' చెప్తే తను అంగీకరించక పోదు."

చాలా సేపు చర్చలు జరిగాక తాత్కాలికంగా


# ప్రియదత్త

సకుటుంబ సచిత్ర వార పత్రిక

**15.01.2003 సంచిక**

**సంక్రాంతి సంచికగా వెలువడుతుంది.**

ఈ సంచికలో ప్రచురణకి రచనలు, కార్టూన్‌లు, ఛాయా చిత్రాలు

**21.12.2002** లోగా పంపవలసిందిగా కోరుతున్నాము.

సంపాదకుడు

ఆ తాళిని తీసేందుకు అంగీకరించి, తన మెళ్ళోని తాళిని తీసి తిరిగి నా చేతిలోనే పెడుతుంటే సిగ్గుతో సగం చచ్చిపోయాను. నా దౌర్భాగ్యానికి తలొంచుకున్నాను.

భావని నన్ను మరోసారి జయించిందేమో!

మరో మూడు నెలల్లో నా ఇండియా ప్రయాణం ఉంది. ఇంటికెళ్ళినపుడు మౌనికకు ఈ విషయం చెప్పి ఒప్పించగలననే నమ్మకమూ ఉంది. కాని, ఎంతటి నమ్మకాలూ అమ్ముడైపోతాయి ఒక్కోసారి మనకు తెలీకుండానే.

మూడు నెల్ల తర్వాత!

కువైట్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో....!

కలువల్లాంటి ఆమె కళ్ళు చెరువులౌతున్నాయి. ఆపుకోలేని దుఖంతో ఆమె ఎద ఎగసెగిసి పడుతోంది....

“ఊరుకో భావనీ! రెండు నెలల్లో తిరిగొచ్చేస్తాగా! ఈ కన్నీళ్ళు ఉండవు. నా మాట నమ్ము.” భావనిని ఓదారుస్తూ అన్నాను.

“నిజంగానా? నా కల నిజం చేస్తారా? ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి మీ ఆస్తి అంతస్తుల్లో నాకు భాగం అవసరం లేదు. మీ బ్యాంకు బేలన్సులు అంతకన్నా అవసరం లేదు. నాకు మీరు కావాలి. “భావనీ” అని ప్రేమగా పిలిచే మీ పిలుపు కావాలి. నాకిపుడు ఎవరూ లేరు. ఒకప్పుడు అమ్మా, నాన్నలతో పాటు అయిన వాళ్ళు ఉండేవారు. కానీ ఇపుడు నేను అందరూ ఉన్న అనాథను” అంటూ ఆమె ఎక్కిళ్ళు పెడుతుంటే నాకు తెలీకుండానే నా కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరగసాగాయి.

“వెళ్ళగానే అన్ని వివరాలతో ఉత్తరం రాస్తాను” అని ఫ్లయింగ్ కిస్సిచ్చి గేటు వైపు నడుస్తూ టాటా చెప్పాను.

నిలబడ్డ చోటే నిలబడి నా వైపే ఆరాధనగా చూస్తూ “బాన్ వామేజ్ డియర్” అంది.

✳ ✳ ✳

ఇండియాతో పాటు ఇల్లూ చేరుకున్నాను.

దిగిన రోజు మాత్రం కన్పించిన వారంతా “అరె సంజీవి! ఎప్పుడొచ్చావోయ్? కులాసానే కదా? ఎన్నాళ్ళయ్యింది నిన్ను చూసి?” అని పలకరించారంతా.

పది రోజులు పోయాక మళ్ళీ ముందు కన్పించిన వారే “ఆ... ఏమోయ్ సంజీవి? ఎలా ఉంది మన ఊరు? అవునూ... తిరిగి ఎప్పుడు వెళ్తున్నావ్ కువైట్‌కు?” అని అడగటం ఆరంభించారు. అది లోకం తీరని తెలుసుకుని నవ్వేశాను తేలిగ్గానే.

నా రాకతో మౌనిక మరో లోకంలో విహరిస్తోంది. మూడేళ్ళ విరహం ఆమెది. ఎంతగానో సంతోషపడుతోంది. ఎన్నో కబుర్లు చెబుతోంది. నేను మాత్రం భావని విషయం చెప్పేందుకు తగిన సందర్భం కోసం ఎదురు చూడసాగాను.

ఆ రోజేదో పండగ. ఇంట్లో ఉన్న దేవుళ్ళు చాలక ఊర్లోని గుడులన్నీ త్రిప్పి హడావుడీ చేసింది. ఆ రాత్రి అర్ధరాత్రి తర్వాత...!

ఆమె మూడ్ బాగున్నట్లనిపించి అదే అదననుకుని ‘మౌనిక’ సౌమ్యంగా పిలిచాను.

నా భుజం మీద తలుంచుకుని, నా ఎదపై చెయ్యేసి

“చెప్పండి!” అంది ప్రేమగా నిమురుతూ.

“ఆ... ఏం లేదు. గాలి చల్లగా ఉంది కదూ?” అసలు విషయం చెప్పేంత ధైర్యం లేక మాట మారుస్తూ అన్నాను అది ఆమె పసిగట్టినట్లుంది అందుకే

“ఎందుకండీ ప్లేటు ఫిరాయిస్తారు? చెప్పండి” అంది.

ఆమె ఊహా శక్తికి ఉలిక్కిపడి

“ఓ చిన్న విషయం చెప్పాలి” నాలో ఆందోళన ప్రారంభమౌతుండగా సంశయిస్తూనే అని ఆగాను.

“పెద్ద విషయమే చెప్పండి. పర్వాలేదు.”

“నీకు ఆకలై, అన్నం దొరకక అల్లాడుతున్నపుడు ఎవరైనా అన్నం పెట్టారనుకో ఆకలి తీరిం తర్వాత వారిని మర్చిపోతావా?”

“లేదు. ఊపిరున్నంత వరకు గుర్తుంచుకుంటాను.”

“మరి వాళ్ళే ఏదైనా ఆపదలో పడితే?”

“అది నా బాధ్యతగా స్వీకరించి ఆదరిస్తాను”

“నేనూ అదే చేశాను.”

“ఏం చేశారు?”

జరిగిన కథంతా వివరించాను.

“అంటే మళ్ళీ పెళ్ళి చేసుకున్నారా?”

“ఆవేశపడకు మౌనికా! జరిగింది చెప్పాగా? ఆ పరిస్థితుల్లో అలా చేయక తప్పలేదు నన్ను ఆదరించిన పాపానికి ఆమె అందరికీ దూరం అయ్యింది. నే చేసింది తప్పా?”

“తప్పని చిన్నగా అడుగుతారేంటి? ముమ్మాటికీ తప్పే” నా ప్రక్క నుండి లేచి మంచం ప్రక్కనే నిలబడి గట్టిగానే అరిచింది.

“అరవకు. ఇది మన సమస్య. ఊరికి సమస్య కాదు అరవటానికి. ఇందాక నువ్వే అన్నావ్‌గా అలాంటి వారెవరైనా ఆపదల్లో పడితే ఆదుకుంటానని” నెమ్మదిగానే అన్నాను.

“అన్నాను. ఆకలి తీర్చారు కాబట్టి ఆకలి తీరుస్తాను. అవసరమైతే నీడనిస్తాను. అంతేగాని పెళ్ళి చేసుకోను” ఆమెలో ఆవేశం క్షణ క్షణానికి పెరిగిపోతోంది.

“నేను చేసిందీ అదే కదా? నీడ నిచ్చాను, నా చెంతలోనే”

“అది తప్పు”


“తప్పెలా అవుతుందని”

“అదంతే”

“నా మాట విను. జరిగిందేదో జరిగి పోయింది. ఇప్పుడు మనం కాదంటే ఎక్కడికి పోతుంది?”

“గోదాట్లో దూకమనండి. అంతేగాని నా మొగుడ్ని మరొకరికి అప్పగించేంత విశాల హృదయం నాకు లేదు. ఇది ఆస్తీ అంతస్తుల విషయం కాదు పంచుకోవటానికి, జీవితం!”

ఏదైతే జరక్కూడదు అనుకున్నానో అదే జరిగినట్లుంది. మా తీవ్ర వాగ్యుద్ధాలు చుట్టు



పక్కల వారు మేలుకుని మరీ విన్నట్లున్నారు. తెల్లారి ఊరు ఊరంతా కోడి కన్నా ముందే కూసింది.

"అవ్వ! సంజీవి పెళ్ళాం బ్రతికుండగానే మరో పెళ్ళి చేసుకున్నాడట" అని.

✳ ✳ ✳

మా ఇద్దరి మధ్య యుద్ధం జరిగి ఇరవైరోజులైనా ఆ వాతావరణపు ఛాయలు ఇంకా పోలేదు. సవ్యంగా సాగితేనే అది సంసారం. లేకపోతే అది నరకంకన్న భయంకరం.

'ఉత్తరాలేమైనా వచ్చాయా?' బయట పనులు ముగించుకుని ఇంట్లోకొస్తూ అడిగాను మౌనికను.

'వస్తే ఇస్తాగా!' నేనేం బ్యాంకులోగానీ దాచుకుంటానా? అయిదన్నరేళ్ళకు రెండుత్తరాలి స్తారని?" విసురుగా అంటూ వంటింట్లో గిన్నెలని కావాలనే అటూ ఇటూ గిరాటేస్తూ ఆమె సమాధానం.

'తిన్నగా చెప్పచ్చుగా?'

'ఇప్పుడు నేనేం చేసానని?'

ఇలా సాగుతోంది మా రోజు వారీ దినచర్య.

భావనికి ఉత్తరం రాద్దామనుకున్నాను. ఇక్కడ జరిగిన వేమీ తెలుపకుండా అపద్దపు ముసుగేసి కానీ ఎందుకో మనసు అంగీకరించక ఆగాను. ఒకవేళ జరుగుతోంది 'ఇదీ' అని రాస్తే తను తట్టుకోగలదా? ఏదైనే అఘాయిత్యం చేసుకుంటే? ఆ పాపం జన్మ జన్మలకూ నాకంటుకోదూ?

చూస్తుండగానే రెండు నెల్ల కాలం కరిగిపోయింది క్రొవ్వొత్తిలా! నేను తిరిగి కువైట్‌కు వెళ్ళాల్సిన రోజూ దగ్గరకొచ్చేసింది.

ఆ ఉదయం!

'మీ రెళ్ళేందుకు వీలుకాదు' తనే రాజ శాసనం చేసేస్తూ అంది మౌనిక.

'ఎందుకని?'

'తెలీనట్లు అడుగుతారేం?'

'అందుకేగా అడుగుతోంది?'

'ఎందుకంటే..... తెలిసి తెలిసి మిమ్మల్ని మరొకరికి అప్పగించలేను. కాదు, వెళ్ళి తీరాల్సిందే నంటే మీ చేతుల్తోనే నాకింత విషమిచ్చి వెళ్ళండి. పుని స్త్రీగానైనా పోతాను. ఆ తర్వాత మీరెవరితో తిరిగినా ఊరేగినా నేనేం చూడను. ఏ విధంగానూ అడ్డురాను.' ఎక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ అంది.

'నన్నర్థం చేసుకునేందుకు ప్రయత్నించవేం? తిండీ తిప్పలూ లేక, ఏ ఉద్యోగం సజ్జోగం లేక అక్కడే చచ్చుంటే ఏం చేసుండేదానివి?'

'నా ఖర్మని ఊరుకుందును'

'ఖర్మని కాకపోయినా! 'పాపం' అనుకుని ఊరుకో రాదూ ఇప్పుడైనా...! ఏం? నీ వల్ల కాదా?'

'అది నా వల్ల కాదు. మీరు కాదని వెళ్తే నా అనుమతి లేకుండా మరో పెళ్ళి చేసుకున్నారని కోర్టులో కేసు వేసయినా మిమ్మల్ని తిరిగి తెచ్చుకుంటాను."

'యు మీన్!'

'నా పేరు మౌనికని, ఏం చేసినా మౌనంగా ఉంటానని మాత్రం అనుకోకండి.'

'అంతవరకు రాకూడదు అనేగా నా ఈ ప్రయత్నం. దయచేసి నాతో సహకరించు.'

'సవతిని తెచ్చుకునేందుకా?'

ఎంత సర్ది చెప్పినా తను 'ససేమిరా' అంది. వెళ్ళాలని నేను. దాదాపు రెండు, మూడు గంటల వాదోపవాదాల తర్వాత

'రెండేళ్ళకు తిరిగొచ్చేయాలి. పెళ్ళి పెటాకులు అంటూ ఎవర్నీ వెంటేసుకుని రాకూడదు. అలా జరిగిందంటే నేను ఛస్తాను."

ఈ వప్పందం మీద, నన్ను పంపేందుకు అంగీకరించి తను. నేను ఏ ఒట్టుకూ వెనకాడలేదు. అలా చేయకుంటే వదలదు.

✳ ✳ ✳

కువైట్ చేరుకున్నాను. ఆ సాయంత్రం ఇద్దరమూ సిటీ పార్కుకు వెళ్ళాం.

'ఎలా జరిగాయి మీ వెకేషన్స్?' ఆప్యాయంగా అడిగింది భావన

'బాగానే జరిగాయి. నువ్వేంటి అలా అయిపోయావ్?'

'మీరు చెంతలేరుగా, అందుకని, వెళ్ళిందగ్గర్నుంచి ఉత్తరం కూడా వ్రాయలేదు. అంత బిజీ అయిపోయారా? నేను రెండు ఉత్తరాలు రాస్తే జవాబే వ్రాయలేదు.'

'ఉత్తరాలా? ఛా.... ఊరుకో. అవేం నాకు అందలేదు.' అంటూనే మరో ప్రక్క ఆలోచించసాగాను.

భావని అబద్ధం చెప్పదు. తను రాసే ఉంటుంది. నేను ఇంట్లో లేనపుడు అవి వచ్చి ఉంటాయి. చదివేసి మౌనిక చించి పారవేసుంటుంది.

'ఏం చేశారు మన విషయం?' ఇంకొంచెం నాకు దగ్గరగా జరుగుతూ ప్రశ్నించింది.

'ఆ.... ఒకే! తనొప్పుకుంది' నా సమాధానంలో నిజాయితీ లేదని నాకు తెలుసు. నిజం చెప్పే ధైర్యం ఎలాగూ లేదు. కనీసం ఒక అబద్ధంతోనైనా ఆమెను సంతోషపెడదామని.

'అబద్ధం.'

తుళ్ళిపడి 'ఏది అబద్ధం?' అన్నాను.

'ఆమె అంగీకరించడం.'

'ఏం ఎందుకని?'

'ఏ ఆడదీ తన జీవితంలోకి సవతిని కోరి కోరి ఆహ్వానించదు. ఆమె స్థానంలో నేనున్నా అంతే!'

'భలే చెప్పావు! తనూ నువ్వన్నట్లే సరిగ్గా అంది. ఆ తర్వాత ముప్ప తిప్పలు పడి వప్పించాను.'


నమ్మమంటారా?

నమ్మకముంటే....

తను నవ్వింది. నేనూ నవ్వాను.

నెల రోజులు గడిచిపోయాయి.

తను గర్భవతినని మౌనిక ఉత్తరం రాసింది. సంతోషించాను కానీ, ఆ సంతోషాన్ని భావనితో కలిసి పంచుకోలేకపోయాను. ఫోన్ చేసి మౌనికతో మాట్లాడాను. మాటలు అటూ ఇటూ తిప్పి చివరికి భావనిని వదిలించుకున్నారా? లేదా? అనే అడుగుతోంది. మరోసారి అబద్ధం చెప్పాను, తప్పించుకునేందుకు ప్రయత్నించే ఖైదీలా. ఆరు నెల్లు గడిచాయి. ఉద్యోగ రీత్యా నేను, భావని విడివిడిగానే ఉంటున్నాం. తన పనిచేసే చోటే



[illegible] అకామిడేషన్ ఇచ్చారు. నాకూ అంతే. వారానికి ఒక్కరోజు మా శెలవు రోజున కలుసుకుంటాం. ఫోన్లంటూ ఉన్నాయి కాబట్టి రోజుకు రెండు మూడు సార్లు మాట్లాడుకుంటాం.

అది విజయదశమి రోజు. రాత్రి పదకొండు కావస్తోంది.

ఫోను రింగవుతుంటే విసుగ్గా లేచి తీసాను. అది భావని పని చేస్తున్నచోటు నుండి.

'భావని చనిపోయింది. మీరు అర్జంటుగా రండి' అని కబురు. నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఉన్న ఫళాన బయలుదేరాను.

'ఈ ప్రపంచంలో ఇక నాకేమీ పనిలేదు' అన్నట్టు ప్రశాంతంగా నిద్రపోతున్నట్లుందేగాని, భావని చనిపోయిందంటే నమ్మ బుద్ధి కావటం లేదు. ఆమె అరచేతిలో ఏదో కాయితం ఉండటంతో తీసుకుని తెరిచాను.

పోలీసువారికి!

నా చావుకు ఎవరూ కారణం కాదు. నా భర్త అమాయకుడు. నాకీ జీవితం మీద విరక్తి పుట్టి ఆత్మహత్య చేసుకుంటున్నాను

భావని"

ఆఖరికి నీ 'చావునీ' నా 'భవిష్యత్తు' కోసమే కేటాయించావా?

నన్నొదిలేసి వంటర్ని చేసేసి.... ఆకలేసినపుడల్లా గుర్తు తెచ్చుకోమని శాసనం చేసేసి.... ఒకప్పటి నా కన్నీళ్ళు, కష్టాల వెనక నీ చెరగని చిర్నవ్వు సంతకం చేసేసి..... నాకు బ్రతుకును ఇచ్చి నువ్వు బతుకును చాలించేసి.... గుప్పెడు గుండెకు గంపెడు రంపపు కోతను మిగిల్చి వెళ్ళిపోయావా ప్రియా!

పసి పిల్లాడిలా ఏడ్చాను.

✳ ✳ ✳

పోస్టుమార్టం పూర్తయ్యాక కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచారు భావని శవాన్ని. విదేశాల్లో ఎవరైనా పోతే వారి శవాన్ని స్వదేశం తీసుకురావడం అంత సులభం కాదు. మరణించిన వారి దేశానికి సంబంధించిన ఎంబసీ నుండి 'డెత్' సర్టిఫికెట్ తేవాలి. ఉంటున్న దేశానికి సంబంధించిన మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్ నుండి సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. ఆపై పోలీస్ డిపార్టుమెంటు నుండి "నో కేస్" సర్టిఫికేట్ తెచ్చుకోవాలి. ఇవన్నీ కలిపి ఎయిర్ పోర్ట్ అథారిటీకి సమర్పించిన తర్వాతే డెడ్ బాడీకి టికెట్ ఇష్యూ అవుతుంది. అదీ డబుల్ చార్జీతోనే.

ఇవన్నీ నాలుగు రోజుల్లో పూర్తి చేసేసాను. భావని పనిచేసిన చోటు నుండి మళ్ళీ ఫోనొచ్చింది. నన్నోసారి వచ్చి ఆమె 'రూం'లో గల వస్తువులు ఏమైనా కావాలంటే తీసుకెళ్ళండి. మిగతావి పారేస్తాం అని" వెళ్ళాను.

ఆమె రూం అంతా జాగ్రత్తగా పరిశీలించాను. ఎక్కడ చూసినా నా ఫొటోలే. 'పిచ్చిది.... ఎంతగా ప్రేమించింది నన్ను!'

అన్నీ వదిలేసి ఆమె ఫొటో మాత్రం తీసుకున్నాను. మూల నున్న టేబుల్ డ్రా తెరచి చూస్తే అందులో కొన్ని ఉత్తరాలున్నాయి. అయితే అన్నింటికన్నా పై భాగాన ఉన్న ఉత్తరమే నన్నాకర్షించింది.

ఆ దస్తూరి నాకు చిరపరిచితమే! గబుక్కున ఆ ఉత్తరాన్ని తీసుకుని వెనుక అడ్రస్ కోసం త్రిప్పి చూసాను.

మౌనిక! దిగ్భ్రాంతికి లోనయ్యాను.

భావని ఫొటోతో పాటు ఆ ఉత్తరాన్నీ తీసుకుని 'నాకు కావల్సినవి ఈ రెండే. మిగతావి మీరేం చేసుకున్నా నాకు అభ్యంతరం లేదు' అని చెప్పి వచ్చేసాను.

హుటా హుటిన రూం చేరుకుని, తలుపులు వేసేసి మౌనిక ఉత్తరం చదవసాగాను. ఆ ఉత్తరంలో నుండి మరో రెండు ఉత్తరాలు రాలి క్రిందపడ్డాయి.

నేను కోరుకోని సవతి భావనికి!

పరిచయాలు అక్కర్లేదనే అనుకుంటున్నాను. ఇద్దరు బద్ధ శత్రువులైనప్పుడు పరిచయాలెందుకు కొత్తగా? నువ్వు మా వారికి వ్రాసిన రెండు ఉత్తరాలూ ఆయనగారు అక్కడికి వచ్చిన ఆర్నెల్ల తర్వాత అందాయి. అది పోస్టల్ వారి పుణ్యం..... నా భాగ్యం కూడాను. అక్కడ నిన్నొదిలేస్తానని ఇక్కడ నాకు మాటిచ్చి, సమస్త దేవుళ్ళ మీద ప్రమాణం చేసి వారక్కడికి వచ్చారు. అయినా ఇంకా మీ 'సం'బంధం కొనసాగుతూనే ఉందని తెలిసింది. ఈలోగా నీ ఉత్తరాలొచ్చాయి. నువ్వూ ఆడదానివే, మరో ఆడదాని కాపురంలో నిప్పులు పోస్తావా? నీకే పెళ్ళయి.... నీ మొగుడ్ని ఎవరో తన్నుకు పోతుంటే తట్టుకోగలవా? ఊహు..... తట్టుకోలేవు. మరి నన్నెలా తట్టుకోమంటావు? నిన్నొదిలేయమని లేకుంటే నేను ఛస్తానని ఖచ్చితంగానే చెప్పి పంపాను ఆయన్ని. అదింకా జరగలేదు. అంటే ఏ మందు పెట్టి, ఏ మంత్రం వేసావు ఆయన మీద. నువ్వేదో నాల్రోజులు అన్నం పెట్టినంత మాత్రాన ఆయన మీద నూరేళ్ళ హక్కు వస్తుందనుకుం టున్నావా? నువ్వు మనిషి వైతే.... సిగ్గు.... లజ్జ... ఇంకా అనేవి గనుక నీకుంటే నా మొగుడి జోలికి రాకు. మా వారిని కలవకు. నీ ఉత్తరాల్లో ఎంత నంగనాచి ప్రేమను వొలకబోసావే! చదువుతుంటే నాకు చిర్రెత్తు కొచ్చింది. నీకిదే ఆఖరి హెచ్చరిక నోర్మూసుకుని నీదారేదో నువ్వు చూసుకో. లేదంటే ఎందులోనైనా పడి చావు. అంతేగాని మా జీవితాల్లోకి రాకు. రావాలని ప్రయత్నం చేయకు. నువ్వు ఛస్తే గానీ నీ పీడ నాకు విరగడవ్వదు.

మౌనిక.

ఆ ఉత్తరం చదివాక నా కళ్ళు తిరగసాగాయి. ఆసరా కోసం గోడను పట్టుకుని మెల్లగా క్రిందే కూర్చున్నాను.

ఎంత పని చేసావు మౌనికా? ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నావు నీ స్వార్థానికి పరా కాష్టగా!


నవ్వుతూ, నన్ను నవ్విస్తూ ఉండిన భావని ఎందుకింత అఘాయిత్యానికి పాలుపడిందో, ఎంత ఆలోచించినా అర్థం కాలేదు అప్పట్లో. కానీ ఆమె మరణానికి కారణం నువ్వా? తను ఆత్మహత్య చేసుకునేందుకు ముందు రోజు కూడా భావని నాతో నవ్వుతూనే మాట్లాడింది.

వాస్తు విజ్ఞానం — -డా॥ 'వాస్తురత్న' ప్రసాద్‌రెడ్డి

# బావులు-వాటి స్థానాలు-2

## వాయువ్య మూల బావి - అశుభం

ఒక ఇంటిలోని వాయువ్య మూల కోణంలో బావి ఏర్పడి వుండుట ఏ మాత్రం మంచిది కాదు. ఇది కూడా ఆ ఇంటి స్త్రీలపై దుష్పరిమాణాలను కలుగ జేస్తుంది. ఖర్చులు అధికమై అప్పుల బాధలు అనుభవించవలసి వస్తుంది.




*(మిగతా వైవారం)*

ఇప్పుడర్థమైంది కారణం. 'మౌనికా!' గది గోడలు పిక్కటిల్లేలా అరిచాను.

❊ ❊ ❊

ఏడెనిమిది సార్లు రింగైన తర్వాత మౌనిక ఫోన్ ఎత్తి 'హలో' అంది.

'నేను' అన్నాను లోలోపలి దావాలనాన్ని అణచుకుంటూ

'మీరా? హాయ్.... చెప్పండి'

'భావని ఆత్మహత్య చేసుకుంది. ఆమె శవంతో సహా బయలుదేరుతున్నాను. ఎక్కడికో కాదు మనింటికే' అని విసురుగా ఫోన్ పెట్టేశాను.

ఆ క్షణంలో ఆమె ఎలా ఫీలయి ఉంటుందో నాకనవసరం.

ఆపై భాస్కరంకు ఫోన్ చేసి, విషయం చెప్పి 'రేపు అర్ధరాత్రికి మద్రాస్ చేరుకుంటాను. నువ్వు జీపు తీసుకుని రా'' అన్నాను అభ్యర్థనగా.

వాడు బాధపడ్డాడు. వాడు నా మిత్రుడు. ఒక్కోసారి భార్య పంచుకోలేని దుఃఖాన్ని కూడా స్నేహితుడే పంచుకోగలడు. స్నేహమంటే అదే.

రేపే నా ప్రయాణం. భావనితో కలసి..... కాదు... ఆమె శవంతో కలసి ప్రియా!

ఆరిపోబోతున్న ఈ జీవి జీవితపు ప్రమిదను ప్రేమతో నీ చేతులడ్డం పెట్టి ఆరిపోకుండా కాపాడేవు. కానీ నీకు నేను ఇచ్చిన ఫలితం మరణం.

కార్చగలిగినంత కన్నీళ్ళు కార్చాను. అంతకన్నా ఏం చేయగలనని?

❊ ❊ ❊

మద్రాస్ ఎయిర్ పోర్టుకు జీపుతో సహా వచ్చాడు భాస్కరం. నేను ఫార్మాలటీస్ అన్నీ పూర్తి చేసుకుని వచ్చేసరికి రెడీగా ఉన్నాడు. నన్ను చూడగానే నా చేతులు పట్టుకుని బావురుమన్నాడు.

భావని గురించి, అంతకు మించి నా ఆకలి దప్పుల గురించి పూర్తిగా తెలిసినవాడు వాడొక్కడే. మా మొదటి ముద్దు దగ్గర్నుంచి ఆఖరి మజిలీ వరకు తెలిసిన మిత్రుడు వాడు. ఎప్పటి సంఘటనలు అప్పుడు, ఎప్పటి సంఘర్షణలు అప్పుడే ఉత్తరాల ద్వారా వాడికి రాస్తుండే వాడ్ని. అందుకే వాడు తట్టుకోలేక పోతున్నాడు.

నా మాట అటుంచి వాడిని ఓదార్చడం నాపనైంది

ఊరు చేరేసరికి తెల తెల వారబోతోంది.

విషయం తెలిసిన ఊరు ఇంకా మేల్కొనే ఉంది. ఇల్లు చేరగానే నాకు జీపు దిగాలనిపించలేదు. భాస్కరం శవాన్ని దించి, కొంచెం దూరంగా మోసుకెళ్ళి, ప్యాకేజీ చీలలు ఊడ దీసారు కొందరు భాస్కరానికి సాయపడగా.

మౌనిక నాకు ఎదురొచ్చింది.

ఆమె ఆర్నెల్ల గర్భం వంక చూసి నిర్వేదంగా నవ్వాను.

నువ్వు! ఏడ్పుకు బద్ధ శత్రువు...!

మౌనిక ఏమీ మాట్లాడలేదు. ఏం మాట్లాడగలదని? ఒక నిండు ప్రాణం గాల్లో కలిసేందుకు కారణ భూతురాలు. అయ్యాక? ఆమె నాతో ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నంతలో భాస్కరం వచ్చి...

'ఒరే శవాన్ని' అని ఆగాడు.

'లోనికి తీసుకెళ్ళండి' అని నేనూ ఇంట్లోనికెళ్ళి ప్రమిదలో నూనె పోసి, వత్తి వేసి వెలిగించాను. ఈలోగా శవాన్ని లోనికి తీసుకువచ్చారు. ఆమె తల కెదురుగా దీపం పెట్టాను.

భావని!

ఆరిపోబోతున్న నా బ్రతుకు దీపం ఆరిపోకుండా చేతులడ్డం పెట్టి కాపాడావు. అందుకు ప్రతిఫలంగా నీకర్పించుకుంటున్న దీపమా ఇది? నా కళ్ళ వెంట కన్నీళ్ళు కాల్వలు కట్టి ప్రవహించసాగాయి.

'అయ్యో పాపం!' అంటున్న వారే కాస్తంత దూరంగా వెళ్ళి 'పోతే పోయింది' అంటున్నారు. అది లోకం తీరు.

తెల్లార్లు నాతో పాటు భాస్కరం కూడా శవ జాగారం చేశాడు. మౌనిక కూడా తప్పదు కాబట్టేమో! తెల్లారేందుకు అట్టే సమయంలేదు. తెల్లారాక భావనిని సాగనంపే ప్రక్రియలు మొదలయ్యాయి.

భావనీ!

నకనకలాడే ప్రేవుల గొడవోవంక, విష్ణు చక్రంలా తిండి లేక గిరగిరా తిరిగే కళ్ళోవంక, ఇంధనం లేని ఇంజన్‌లా ముందుకు సాగమని మొండికేస్తున్న కాళ్ళొక వంక, వంద కూత పిట్టలు ఒక్కసారిగా కూసినట్లు చెవులు 'గయ్' మంటున్నా యొక వంక.... నీరు లేని బావిలా నా కళ్ళు అగాధంలో కెళ్ళినట్లున్న ఆ రోజులను అంత సులభంగా మరచిపోతే నేను మనిషినెలా అవుతాను ప్రియా!

గుండె నెవరో అదే పనిగా గుండు సూదులతో గ్రుచ్చినట్లుంటే చివరగా... ఆఖరిగా.... ఆమెకు... ఆమె ప్రేమకు.. ఆమె త్యాగానికి కన్నీటి నివాళులు అర్పిస్తూ చితికి నిప్పంటించాను.

❊ ❊ ❊

'నాదో కోరిక తీరుస్తారా?'

'ఏంటో చెప్పవే!'

'ఒట్టేస్తే గానీ చెప్పను'

'నీ మీద ఒట్టు, తీరుస్తాలే చెప్పు.

'నా మీద ఒట్టంటే నేను చచ్చినట్లే. తీరుస్తారా?'

'అబ్బా తీరుస్తానన్నాగా!'

'మనం పెళ్ళి చేసుకోవాలి.'

'పెళ్ళా' అని పకపకమని నవ్వి 'అదెప్పుడో జరిగిపోయింది కదే! మళ్ళీ పెళ్ళేమిటి?' అన్నాను.

'నాలుగ్గోడల మధ్య జరిగింది కాదు. పది మంది పెద్దల సమక్షంలో, భాజా భజంత్రీల మధ్య, వీడియో కెమెరా కవరేజ్‌తో జరగాలి. పుట్టిన ప్రతి ఆడపిల్లా తన పెళ్ళి ధాం..... ధాం.... గా జరగాలని కలలు కంటుంది. తనదైన కలల ప్రపంచంలో విహరిస్తుంది. నా మాటలు నిజం కాదంటారా?' భావని గొంతులో బైటపడలేక, అక్కడే ఉండలేక సతమతమవుతున్న దుఃఖాన్ని గమనించాను.

'నిజం లేదనను.

'అదేనండి నేను కోరుకునేది. అయిన వారికా దూరం అయ్యాను. వాళ్ళ సంగతి వదిలేద్దురూ. నాది గొంతెమ్మ కోరికో లేక ఇంకేదైనా



## సినిమాలే బెటర్

బుల్లితెర హీరోయిన్ అయిన అనిత 'నువ్వూ-నేనూ' చిత్రం ద్వారా పెద్ద తెరకు పరిచయం అయింది. ప్రస్తుతం తెలుగుతోపాటు హిందీలోనూ రెండు చిత్రాల్లో నటిస్తున్న అనితకు పెద్ద తెర అవడం వల్ల కలిగే లాభాల గురించి తెలిసి వచ్చినట్లుంది. టీ.వీ కంటే సినిమాలే బెటర్ అంటూ అందరికీ ఈ మధ్య తెగ చెబుతోంది. అయితే బరువును కంట్రోల్లో ఉంచుకోవడమే అనితకు మహా కష్టంగా ఉందట.



## దియా గొప్పలు

సహజంగా అమ్మాయిలు ఒక వయస్సు వరకు మాత్రమే పెరుగుతారు. ఆ తరువాత పొడవు పెరగడం ఆగిపోయి అడ్డంగా పెరుగు తారు. కానీ దియా మాత్రం తాను 'మిస్ ఏషియా ఫసిఫిక్' కిరీటాన్ని గెల్చుకున్నప్పటి కంటే ఒక అడుగు పొడవు పెరిగానని బాలీవుడ్‌లో అందరికీ గొప్పగా చెప్పుకుంటూ తిరుగుతోంది. దియా ఇంకా చిన్నపిల్లలాగా, పొడుగు పెరిగానని చెప్పుకోవడం విని ఆటపట్టిస్తున్నా, నేను చెప్పింది నిజం అని వాదిస్తోందిట.

అనుకోండి, పర్వాలేదు. ప్లీజ్ నలుగురి సమక్షంలో నా మెళ్ళో తాళి కట్టండి" అంది భావని బేలగా.

మనసు కరిగి కన్నీరైతే.... కోరికలు కొరడా ఘల్లుమంటే, ఆవేదన కట్టుబాట్లుకెందుకు?' అని ప్రశ్నిస్తే, వీటన్నింటికీ సమాధానం మౌనం కాక మరేమౌతుంది. అదే నన్నూ ఆవహించింది.

'మాట్లాడరేం?'

'ఛీ.... ఊరుకో అవేం మాటలు!' అన్నానే గాని నిన్నటిపై నీకే హక్కులూ లేవు. రేపటిలో నువ్వుంటావో లేదో నీకే తెలీదు. అలాంటపుడు నీవారికైనా... పరాయి వారికైనా.... ఏదారీ లేక అలమటిస్తున్న వారికైనా ఆశలు కల్పించటం ఎందుకు? అయినా ఏం పొందాలనుకుంటున్నావో అవన్నీ ప్రోగు చేసి పొందేందుకు ప్రయత్నించు. కానీ మిత్రమా! ఏది భరోసా పిచ్చాడు ఎడారి కెళ్ళినట్లు.... రాత్రి నిద్రపోయిన నువ్వు తెల్లారి నిద్రలేస్తావని నమ్మకం లేనప్పుడు?!

ఆమె కోరిక నేను తీర్చలేనని నాకు తెలుసు. అగ్ని సాక్షిగా మౌనిక మెడలో మూడు ముళ్ళేసాను ఒకసారి. ఇపుడు మళ్ళీ మరోసారి భావనికి.... నాకది సమంజసమే కావచ్చు. కానీ లోకం హర్షించదు. తెగనాడుతుంది.

నీతులు చెప్పేదే లోకం. తనదాకా వస్తే అది పిచ్చి మాలోకం.

భావని కోరిక నాలోని అంతరాత్మను సూటిగా ప్రశ్నిస్తోంది. మనసంతా ఏదో తెలినీ ఉద్విగ్నతకు లోనౌతోంది.

ఆమె కోరిక చిన్నదే. తీర్చాలంటే తీర్చలేనంత పెద్దది కూడా.

* * *

ఇలా భావని జ్ఞాపకాలు నాచుట్టూనే పరిభ్రమిస్తూ సాలీడు గూడులా అల్లుకుంటున్నాయి. ప్రతిక్షణం మనసు చిత్ర వధను అనుభవించాల్సొస్తోంది. 'నన్ను బ్రతికించిన ఆమెను చంపుకొన్నాను' ఇదే ప్రశ్న నా హృదిలో జీవితాన్ని తాకుతూ ప్రశ్నిస్తోంది.

'లేవండి, భోం చేద్దురూ?' మౌనిక నన్ను సమీపిస్తూ అంది.

నేను ఏమీ జవాబివ్వలేదు. ఎలా చెప్పగల్ను జవాబు, నన్ను నేనే కోల్పోయినపుడు?

'ఏం నాతో మాట్లాడకూడదని శపథం చేసుకున్నారా?'

ఆమె ప్రశ్నకు సమాధానంగా ముఖం అటువైపు తిప్పుకున్నాను.

'నాతో మాట్లాడక పోతే పోయారు. అన్నం ఏం చేసిందని? లేవండి' ఆమే మళ్ళీ అంది.

ప్లీజ్ మౌనిక.... నన్నొంటరిగా వదిలేయ్' అన్నాను అదో రకంగా ఒక గ్రాండ్ పార్టీ ఇవ్వలేని ఆనందం కూడా ఒక్కోసారి ఒక్క వంటరితనమే ఇవ్వగలుగుతుంది అది... ఆ అనుభూతి, అనుభవంతోనే అవగతం అవుతుంది. జీవితానికి, జీవనానికి అర్థం తెలిస్తె....!?

'ఇప్పుడేం జరిగిందని?'

'ఏం జరిగిందా? అంటే ఏమీ జరగలేదా?'

'జరిగిన దాన్నే తల్చుకుంటూ కూర్చుంటారా?'

తలపులకు ఉన్న విలువ 'తను' అనుకున్న వారు పోతేనే తెలుస్తుంది. అదీ అందరికీ తెలియదు. ఏ కొందరికో తప్ప!

'జరిగింది మామూలు సంఘటన కాదు. అయినా నీకెలా అర్థం అవుతుంది. అది అర్థం కావాలంటే....'

'మనసుండాలి. మనిషై ఉండాలి అంటారు అంతేనా? అంతే లెండి ఉంచుకున్న దాని శవం అంత దూరం నుండి మన ఇంటికే తీసుకొచ్చారు. నా కళ్ళ ముందే భర్త పాత్ర వహించి దహనం చేశారు. అయినా నేనేం మాట్లాడలేదు. నాకు మహాసెలా ఉంటుంది. ఇరుగుపొరుగు వారు, అయినవారు, కానివారు అంతా 'అవ్వ' అని ముక్కున వేలేసుకుని నన్నెగతాళి చేసినా ఊరుకున్నాను. నేను మనిషిని ఎలా అవుతాను.'

'మనిషైతే మరో మనిషిని చంపరు.'

'ఎవరు ఎవర్ని చంపారు?'

'చంపింది నువ్వు. చంపబడింది భావని.'

'ఎలా?'

'ఇలా' అని నా జేబులోని ఉత్తరాల్ని ఆమె ముఖంపైకి విసిరాను. నేలపడ్డ ఆ ఉత్తరాన్ని ఆమె తీసుకోలేదు. ఎందుకు తీసుకుంటుంది? అది తను రాసిన ఉత్తరమేనని ఖచ్చితంగా తెలిసినపుడు!

'ఇదిగో మౌనిక, నీకిదే చెపుతున్నాను. నేను బ్రతికున్నంతవరకు నాతో మాట్లాడకు. నీ అవసరాలేమిటో కాయితం మీద రాసి ఇవ్వు. తీరుస్తాను ఈ క్షణం నుండి మనం ఒకే ఇంట్లో ఉంటున్న పరాయి వాళ్ళం. మన బతుకులు వేరు. పడకలు వేరు. కన్నీళ్ళు వేరు కలలు వేరు చివరకు చావులు కూడా వేరే. దట్సాల్' అని లేచాను.

ఆ తర్వాత మౌనిక నన్ను శాంత పరచటానికి ఎన్నో విధులుగా ప్రయత్నం చేసింది. క్షమాపణలు వేడుకుంది. ఆమె ప్రయత్నాలన్నీ ప్రయత్నాలుగానే మిగిలిపోయి ఓడిపోయింది ఘోరంగా.

అప్పటికి ఆమె ఆర్నెల్ల గర్భవతి. మరో మూడు నెల్ల తర్వాత కవల పిల్లలకు జన్మనిచ్చింది. భగవంతుడు కూడా ఆమె పక్షంలోనే నిలిచినట్టున్నాడు. ఒకే బిడ్డను ప్రసాదిస్తే మా గొడవల కారణంగా ఆమెను నేను మళ్ళీ ముట్టుకోనని. ఎంత పక్ష పాతో కదా!

మా సంసారంలో నిశ్శబ్దం. పిల్లల పెంపకంలో నిశ్శబ్దం. అంతా నిశ్శబ్దమే. పిల్లలు పెద్దయ్యారు. పెళ్ళిళ్ళు చేసుకుని ఎవరి త్రోవన వారు వెళ్ళిపోయారు. నేడో రేపో అన్నట్లున్న మా జీవితాల నుండి మాత్రం నిశ్శబ్దం తొలగలేదు. అది తొలగి పోదు కూడా.

ఇప్పటికీ అప్పుడప్పుడు మౌనిక నాతో మాట్లాడాలనే ప్రయత్నిస్తుంటుంది. నేను మాత్రం ఆ ప్రయత్నం ఎప్పుడూ చేయలేదు. ప్రతి విజయదశమికి నా మౌనం రెట్టింపు అవుతుంది. నా 'భావని'కి నేను ఇవ్వగలిగిన బహుమతి ఇదొక్కటే. 'ఇది తప్పు సంజీవి' అన్నారెందరో.

అలాంటి వారికి నా మౌనమే సమాధానం చెప్పింది. ఎప్పటికీ నేను నోరున్న మూగవాడిని.... బ్రతుకుతూ కదులుతూ శ్వాస పీలుస్తున్న శవాన్ని.